కార్మికుల పక్షాన పోరాడేది వామపక్షాలే

- శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కూనంనేనికి మాట్లాడే అవకాశం పట్ల హరీశ్‌రావు అభ్యంతరంపై ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల సమస్యపై ప్రశ్న అడగని కూనంనేని సాంబశివరావును ఎలా మాట్లాడనిస్తారని హరీశ్‌రావు అనటం ముమ్మాటికి తప్పు అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం శాసనసభ సమావేశాల్లో క్వశ్చన్ అవర్‌లో ఆర్‌టిసి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు అనే అంశంపై హరీశ్‌రావు మాట్లాడే సమయంలో సిఎం జోక్యం చేసుకుని మాట్లాడారు. 'హరీశ్‌రావుకు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. చైర్‌మీద ఆరోపణలు చేయడం ఏ సభ్యునికీ తగదు. ఖమ్మం జిల్లాకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి తన పిల్లలు పెద్ద ఉద్యోగాల్లో ఉన్నా ఆనాటి ప్రభుత్వం 50 వేల కార్మికులున్న ఆర్‌టిసి సంస్థ పట్ల వ్యవహరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఆత్మబలిదానం చేసుకున్నాడు. సమ్మె కాలంలో ఆర్‌టిసి కుటుంబాలకు కమ్యూనిస్టులు అండగా నిలబడ్డారు. కార్మికుల పక్షాన పోరాడేదే కమ్యూనిస్టు పార్టీలు. సభలో కార్మికుల తరపున ఆ పార్టీ సభ్యుడు సాంబశివరావు మాట్లాడుతామంటే.. కార్మికుల పక్షాన కొట్లాడే వారికి ప్రాధాన్యత ఇవ్వాలనీ, వారి సూచనలు బాగుంటే వాటి ద్వారా సమస్యలు పరిష్కరించాలని భావించి స్పీకర్ అవకాశమిచ్చారు. ప్రశ్న అడగకపోయినా ఆయనతో ఎలా మాట్లాడిస్తారు? అని హరీశ్‌రావు అడగటం చట్ట విరుద్ధం. సభలో ఏ ప్రశ్న అయినా ఆమోదం పొందినట్లయితే ఆ ప్రశ్న సభ ఆస్తి. ప్రశ్న అడిగిన వారికే అవకాశమివ్వాలనీ, మిగతావారిని మాట్లాడనివ్వొద్దని ఏ చట్టంలోనూ లేదు. స్పీకర్ అనుమతి ఇస్తే ఎవరైనా మాట్లాడొచ్చు. ఎవరికి అవకాశం ఇవ్వాలనేది స్పీకర్ విచక్షణ. సాంబశివరావుకు అవకాశమివ్వడాన్ని తప్పు బట్టడం నూటికి నూరు శాతం తప్పు. భవిష్యతులోనైనా హరీశ్‌రావు దీన్ని సవరించుకోవాలి. పదేపదే హరీశ్‌రావు రూల్ బుక్ గురించి మాట్లాడుతున్నారు అధ్యక్షా. అదే రూల్ బుక్కులో సభ్యులు చైర్‌ను వదిలి పోడియంలోకి వెళ్తే అదే సభ్యులను బయటకు పంపే నిబంధన కూడా ఉంది. కానీ, స్పీకర్ అది ఉపయోగించలేదు. చైర్‌కు ఆ సమస్య ప్రాధాన్యత తెలుసు కాబట్టి ఎక్కువ సేపు మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. ప్రభుత్వం నుంచి సమర్థవంతమైన సమాధానాన్ని మంత్రి ఇచ్చారు. అయినా, వారు సంతృప్తి చెందలేదు. ఎందుకంటే, పదేళ్లుగా వారు చేసిన తప్పులను ఈ ప్రభుత్వం కూడా చేయాలనే కోరిక ఉండవచ్చు. నిర్దిష్ట ప్రణాళికతో ఆర్‌టిసి సంస్థను బతికించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఆర్థికంగా బలోపేతం చేయాలని అహర్నిషలు కృషి చేస్తుంటే ఏదేదో మాట్లాడుతున్నారు. ఆనాడు ఆర్‌టిసి గుర్తింపు కార్మిక సంఘానికి హరీశ్‌రావు గౌరవాధ్యక్షులుగా ఉన్నారు. ఆ పదవి నుంచి ఆయన్ను ఎలా తొలగించాలో అర్థం కాక అప్పటి సిఎం ఆర్‌టిసిలో కార్మిక సంఘాలనే రద్దు చేశారు. వాళ్లే ఆర్‌టిసిలో యూనియన్లకు అనుమతి ఇవ్వాలని మాట్లాడటం పాత తప్పులను కప్పిపుచ్చుకునేలా, ప్రస్తుత ప్రభుత్వంపై బురద జల్లేలా ఉంది. ఇది సమంజసం కాదు. సభలో 119 మంది సభ్యులుంటే 60 మందికిపైగా కొత్తవారే ఉన్నారు. హరీశ్‌రావురావుకు 20 ఏండ్ల అనుభవం ఉంది కాబట్టి ప్రశ్న వేసినవారే సప్లమెంటరీ ప్రశ్నలు వేయాలని కొత్త సభ్యులు అనుకునే అవకాశముంది. అందరికీ గుర్తు చేస్తున్నా... ఒక్కసారి ప్రశ్న హౌజ్‌లో అడ్మిట్ అయితే ఆ ప్రశ్న సభది. స్పీకర్ అనుమతిస్తే ఎవరైనా మాట్లాడే హక్కు ఉంటుంది. దయచేసి సభను పక్కదోవ పట్టించొద్దు హరీశ్‌రావు' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ఆర్‌టిసి యూనియన్లను ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారు? : హరీశ్‌రావు

ఆర్‌టిసిలో యూనియన్లను పునరుద్ధరించేది లేదని ఉత్తర్వులు ఇచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఉత్తర్వులు ఇచ్చారా? లేదా? ఎప్పటిలోగా యూనియన్లను పునరుద్ధరిస్తారు? అనే దానిపై నిర్దిష్ట సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు అడిగారు. కార్మికులు ఎవరైనా చనిపోతే వెంటనే రెగ్యులర్ ఉద్యోగాలివ్వాలని కోరారు. కార్మికులకు రూ.300 కోట్ల చెక్కు ఇస్తున్నామని సిఎం చెప్పారని, ఐదు నెలలు దాటినా ఆ చెక్కు నెక్లెస్ రోడ్డు నుంచి బస్‌భవన్‌కు చేరలేదని విమర్శించారు. ఎప్పుడిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్‌టిసికి ఇవ్వాల్సిన నిధులెన్ని? ఇప్పటిదాకా ఇచ్చినవెన్ని అనేదాన్ని చెప్పాలని అడిగారు. కార్మికుల పిఎఫ్, సిసిఎస్ డబ్బులను మళ్లించి కార్మికులకు జీతాలిచ్చిన మాట వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఆ నిధులను ఎప్పటిలోగా ఇస్తారని అడిగారు. ఆర్‌టిసిలో కార్మికులను 14,16 గంటల పనిచేయించడం తగదన్నారు. కొత్త ఉద్యోగులను ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఆర్‌టిసి ఉంటదా? మూతపడుతుందా? అనే పరిస్థితి తెచ్చారు : పొన్నం

పదేండ్లుగా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసి ఆ సంస్థ ఉంటదా? మూత పడుతుందా? అనే పరిస్థితిని తెచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఎలాంటి సంప్రదింపులు లేకుండా, చర్చల్లేకుండా, ఆర్‌టిసి యాజమాన్యానికి కూడా చెప్పకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ప్రకటించి ఇప్పుడు దానికి రాజకీయ రంగు పులమాలని చూడటం దుర్మార్గమన్నారు. గవర్నర్ అనుమతిస్తలేరని కార్మికులతో రాజ్‌భవన్ ముందు ఆందోళన చేయించిన వీరి రాజనీతి ఏంటని ప్రశ్నించారు. ఆర్‌టిసిలో యూనియన్లను రద్దు చేసిన వారికి పునరుద్ధరించాలని మాట్లాడే హక్కులేదన్నారు. ముందు ఆర్‌టిసి కార్మికులకు క్షమాపణ చెప్పాలని కోరారు. 50 రోజులు కార్మికులు సమ్మె చేస్తే పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు.

ఆర్‌టిసికి 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.280 కోట్ల పెండింగ్ బకాయిలను బాండ్ల రూపంలో ఇచ్చామని, ఇప్పటికే రూ.80 కోట్లు చెల్లించామని చెప్పారు. తమ ప్రభుత్వం కార్మికుల పిఎఫ్, సిసిఎస్ డబ్బులను ముట్టలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రూపాయలను వాడుకున్నదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.300 కోట్ల చొప్పున రూ.2వేల కోట్లను ఇచ్చామని తెలిపారు. 3035 మంది ఉద్యోగులను నియమించామన్నారు.

బస్సు సర్వీసులకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో కార్మికులపై ఓవర్‌లోడ్ పెరిగిన మాట వాస్తవమేనన్నారు. అయితే, కార్మికులకు అదనంగా చేసిన పనికి పేమెంట్ చెల్లిస్తు న్నామని స్పష్టం చేశారు. ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లకు కృతజ్ఞ తలు తెలిపారు. ఆర్‌టిసి ఆస్తులను గత ప్రభుత్వం ఆ పార్టీ నేతలకు కట్టబెట్టిన తీరును ఆయన ఉదహరణలతో చెప్పారు.

గత ప్రభుత్వ తప్పులను ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్దాలి : కూనంనేని సాంబశివరావు

50 రోజుల పాటు జరిగిన ఆర్‌టిసి కార్మికుల సమ్మె కాలంలో ఖమ్మంలో ఒక డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని సిపిఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిలో యూనియన్లను రద్దు చేసి వారు మాట్లాడలేని పరిస్థితి కల్పించిందని విమర్శించారు. కార్మికులకు సమస్య వస్తే మాట్లాడలేని పరిస్థితిని కల్పించిందని వాపోయారు. ఆనాటి ప్రభుత్వం చేసిన తప్పులను ఇప్పుడున్న ప్రభుత్వం సరిదిద్దాలని కోరారు. 'ప్రశ్నలో భాగస్వామ్యం లేని కూనంనేని సాంబశివరావు మాట్లాడటానికి సమయం ఇస్తారు? అందులో సమయం వృథాకాదా? మేం మాట్లాడితే వృథా అవుతుందా? ఇదేం పద్ధతి' అంటూ హరీశ్‌రావు మాట్లాడగా సిఎం జోక్యం చేసుకుని మాట్లాడారు.

సభలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

రామదాసు స్ఫూర్తితో ఉద్యమించాలి

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రామదాసు స్ఫూర్తితో ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు. బుధవారం వీరపనేని రామదాసు వర్ధంతి సందర్భంగా ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలోని కమ్మ ఫంక్షన్ హాల్‌లో పొదిల్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించిన రామదాసు, వెంకట సుబ్బమ్మ దంపతుల నాలుగవ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా సీనియర్ నాయకులు గుండు సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు రామదాసు, వెంకట సుబ్బమ్మ దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లిన సమరయోధుడు రామదాసు అని కొనియాడారు. జైలుకు వెళ్లేటప్పుడు కాంగ్రెస్ కార్యకర్తగా వెళ్లి తిరిగి సంపూర్ణ స్వాతంత్రం నినాదంతో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా బయటకు వచ్చారని గుర్తుచేశారు. అప్పటి నుంచి జీవితం అంతం వరకూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేశారని అన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ములుగు గిరిజన యూనివర్సిటీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని అన్నారు. సింగరేణి బొగ్గు బావులను ప్రయివేటుకు వేలం వేస్తున్నారని తెలిపారు. అదానీ, అంబానీ లాంటి వారికి వేల కోట్ల రాయితీలు ఇస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. ప్రభుత్వ ఆదాయం 14.5 శాతం పెరిగితే ఖర్చులు మాత్రం 5.94 శాతం మాత్రమే పెరిగాయని బడ్జెట్ గణంకాలు చెబుతున్నాయని తెలిపారు. పెరిగిన ఆదాయాన్ని ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు వినియోగించకుండా కార్పొరేట్ల రాయితీలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి చోటు ఇవ్వని కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట రెడ్డి, రామదాసు కుమారులు డాంగే, కృచేవ్, చంద్రశేఖర్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రత్నం రాజేందర్, బీరెడ్డి సాంబశివ, కొప్పుల రఘుపతి, తీగల ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసం పైరవీలు చేయను

- లాబీల్లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్

తాను మంత్రి పదవి కోసం పైరవీలు చేయనని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వరరెడ్డిలకు, రాజగోపాల్‌రెడ్డికి మధ్య బుధవారం అసెంబ్లీ లాబీల్లో సరదా సంభాషణ చోటు చేసుకుంది. ముందుగా ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. రాష్ట్రంలో అసలు గేమ్ ఇప్పుడే స్టార్టయ్యిందంటూ రాజగోపాల్‌రెడ్డి బిఆర్ఎస్‌నుద్దేశించి సెటైర్ వేశారు.ఆ గేమ్ కాంగ్రెస్ పార్టీలో ప్రారంభమైందా? లేక రాష్ట్ర ప్రభుత్వంలోనా అంటూ ఆయన్ను బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎద్దేవా చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జైలుకుపోయే జాబితాలో మొదటి వ్యక్తిగా ఉన్నారని తెలిపారు. తాము కేసీఆర్ లాగా ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 20, 30 కోట్లిచ్చి కొనలేమంటూ తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.300 కోట్లు ఖర్చు చేసి కర్ణుడిని ఓడించినట్టు తనను ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రభావం బిఆర్ఎస్‌పై పడిందని, అందుకే కేసీఆర్ అధికారాన్ని కోల్పోయారని చెప్పారు. రాజగోపాల్ అన్నా...నీవెప్పుడు సీఎం ఎప్పుడవుతున్నావ్ అంటూ ఎమ్మెల్యేలు అడగ్గా, ముఖ్యమంత్రి అయ్యేదుంటే కావొచ్చు అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

సిద్ది వినాయక బజాజ్‌లో చేతక్ 2901 విడుదల

హైదరాబాద్ : ఆటోమోటివ్ పరిశ్రమలోని ప్రముఖ రిటైలర్ సిద్ది వినాయక బజాజ్ తన బేగంపేట్ చేతక్ సిఇసి షోరూంలో చేతక్ 2901ని విడుదల చేసింది. ఈ విద్యుత్తు స్కూటర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చేతక్ డివిజన్ నుండి ఎండి కె వి బాబుల్ రెడ్డి, రీజనల్ మేనేజర్ కె మంజునాథ్, ఏరియా సేల్స్ మేనేజర్ ప్రవీణ్ పరదేశి పాల్గొన్నారు.

గ్రూప్-1లో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు అన్యాయం

- తీన్మార్ మల్లన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1కు సంబంధించి 1:50 నిష్పత్తి చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేశారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. అయితే ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులు మెరిట్‌లో ఉన్నా ఓపెన్ కేటగిరీలో కాకుండా రిజర్వేషన్ జాబితాలో ఎంపిక చేశారంటూ తనకు ఫిర్యాదులు అందాయని చెప్పారు. దీంతో వారికి అన్యాయం జరిగిందని అన్నారు. యుపిఎస్‌సి తరహాలో ఎంపిక చేస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు.నల్లమల అడవుల నుంచి చెంచులను బలవంతంగా తరలించొద్దని ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. యురేనియం తవ్వకాలను చేపట్టొద్దని సూచించారు. నల్లమల అడవుల్లో పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

పశువుల పాకలోకి దూసుకెళ్లిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు పూర్తిగా గుంతలమయం అవడంతో ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి పశువుల పాకలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన బుధవారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అర్లి-టి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం..ఉదయం కరంజీ గ్రామం నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అర్లి-టి గ్రామానికి రాగానే రోడ్డు పూర్తిగా గుంతలు ఉండటంతో వాటిని తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బక్కి సునీల్‌కు చెందిన పశువుల కొట్టంలోకి బస్సు దూసుకెళ్లింది. కొట్టం పూర్తిగా ధ్వంసం కాగా.. రెండు ఎడ్లకు గాయాలయ్యాయి.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

- సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..
- పలు జిల్లాల్లో నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌తో సామన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ముఖ్యంగా తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు ఇవ్వలేదని, విభజన హామీలను అస్సలు పట్టించుకోలేద సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం పలు జిల్లాల్లో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు విభజన హామీలైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, సైనిక స్కూల్, మామునూరు విమానాశ్రయం ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. కాళోజీ సెంటర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. పరకాలలోని బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

భద్రాచలం ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గట్టుసెంటర్‌లో నిరసన తెలిపారు. కొత్తగూడెంలో బస్టాండ్ సెంటర్‌లో బడ్జెట్ పత్రాలు దహనం చేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు.

ఆందోళన చేస్తున్న జిహెచ్‌ఎంసి కాంట్రాక్టు కార్మికులు

జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

- బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్
- అసెంబ్లీకి ముట్టడికి ప్రయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం హై టెన్షన్ నెలకొంది. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మే వరకు చేసిన పనులకుగానూ రూ.1200 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన పనులు రూ.20 కోట్లు, ఇటీవల పార్లమెంటు ఎన్నికల సందర్భంలో చేసిన పనుల బిల్లులు మరో రూ.20 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. మొత్తం రూ.1240 కోట్లు వెంటనే చెల్లించాలంటూ మంగళవారం నుంచి కాంట్రాక్టర్లు ఆందోళన బాట పట్టిన సంగతి తెలిసిందే. బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాంట్రాక్టర్లు జిహెచ్‌ఎంసి నుంచి అసెంబ్లీ ముట్టడికి వెళ్లాలని నిర్ణయించారు. జిహెచ్‌ఎంసిలో ఉన్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అదే సమయంలో ఎదురుకావడంతో ఇరువురి మధ్య వాగ్వాదం, ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు వారికి నచ్చజెప్పారు.

వర్షం సహాయక చర్యలను సైతం బహిష్కరిస్తాం

పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే వర్షం సహాయక చర్యలను సైతం బహిష్కరిస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 14 నెలలుగా బిల్లులు క్లియర్ కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కొంత మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. వడ్డీలకు తెచ్చి, బంగారం ఆభరణాలు సైతం తాకట్టు పెట్టి నగరంలో రూ. 1200 కోట్లకుపైగా విలువగల పనులను చేశామని, ఈ క్రమంలో చాలామంది కాంట్రాక్టర్లు అప్పుల్లో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోవట్లేదన్నారు. బకాయిలు వెంటనే చెల్లించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి

- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి హరగోపాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ ఆధ్వర్యంలో మేధావులు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు పెంచలేదన్నారు. అలాగే చాలా కాలంగా విద్యకు మూలధన వ్యయం ఒక శాతం కూడా పెంచలేదంటే కొత్త పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను స్థాపించలేదనేది అర్థమవుతున్నదని అన్నారు. కేటాయించిన కొద్దిపాటి నిధులు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్ల వేతనాలకు సరిపోతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 20 శాతం నిధులు కేటాయిస్తే తప్ప ఇంత వరకు విద్యారంగానికి జరిగిన నష్టాన్ని పూడ్చలేమన్నారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.చక్రధరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, టిపిటిఎఫ్ అధ్యక్షులు అశోక్ కుమార్, పిడిఎస్‌యు అధ్యక్షులు పి.మహేష్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించినట్టు మోడీ ప్రభుత్వం అంకెలు గారడి చేసిందని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్)రాష్ట్ర కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీరాం నాయక్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో అవాస్తవాలు మాట్లాడారని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమానికి గతేడాది రూ.7,273 కోట్లు కాగా ఈ ఏడాది రూ.13,000 కోట్లు కేటాయించినట్టు చెప్పడం పార్లమెంటు సాక్షిగా గిరిజన సమాజాన్ని తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. గతేడాది బడ్జెట్‌లో రూ.12,461 కోట్లు కేటాయించిన వాస్తవాన్ని చెప్పకుండా, సవరించిన అంచనా రూ. 7,273 కోట్లు మాత్రమే చెప్పి అంకెల గారడీకి పాల్పడిందన్నారు. గిరిజనుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించామని నమ్మించే ప్రయత్నం చేసిందని విమర్శించారు. కేవలం రూ.539 కోట్లను మాత్రమే పెంచిందని తెలిపారు. గిరిజన తెగల్లో నిరుద్యోగం, ఉపాధి లేమి తీవ్రస్థాయిలో పెరిగిన నేపథ్యంలో వారికి ఎన్ఎస్ఎఫ్‌డిసి ద్వారా ఆర్థిక అభివృద్ధికి రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. అరకొరనిధులను కేటాయించి వారిని మరింత పేదరికంలోకి నెట్టే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల ముందు గొప్పగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం భవనాలు, ఉద్యోగులు, విద్యార్థులకు ప్రవేశాలు కల్పించకుండానే బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించకుండా సెంట్రల్ యూనివర్సిటీ గ్రాంట్లలో విలీనం చేశామని చెప్పడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్న బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని నిర్మించలేమని చేతులెత్తేయడం వారికి ద్రోహం చేయడమేనని విమర్శించారు. గిరిజన తెగల ఉనికికే ప్రమాదం ఏర్పడుతున్న నేపథ్యంలో అత్యంత వెనుకబడిన గిరిజన తెగల అభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ. 256 కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.20 కోట్లు మాత్రమే కేటాయించడం వారి పట్ల నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. బిజెపి అధికారంలోకొచ్చిన పదేండ్ల కాలంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఒక్క కొత్త పథకాన్ని ప్రకటించ లేదని తెలిపారు. బడ్జెట్‌లో గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించిందని ఆరోపించారు. సబ్ ప్లాన్ కు గత బడ్జెట్‌లో 102 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో రూ.1 లక్షా 19 వేల కోట్లు కేటాయించగా ఇందులో కేవలం 25 శాతం నిధులను మాత్రమే ఖర్చు చేసి, మొత్తం ఖర్చు చేశామని దొంగ లెక్కలు చూపుతున్నారన్నారని విమర్శించారు.

ఆరు గ్యారంటీల అమలు వరకూ పట్టుపడతాం..

- బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసేవిధంగా కనపడటం లేదని, వాటిని అమలు చేసేవరకు పట్టుపడుతామని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం ఇతర బిజెపి ఎమ్మెల్యేలతో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. తెలంగాణ రావడానికి కారణమైన బిజెపిని విమర్శిస్తున్నారన్నారు. ప్రజల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వస్తున్న వ్యతిరేకతతో కేంద్రంపై నింద వేయడానికి శాసనసభలో తీర్మానం చేశారని విమర్శించారు. మిలటరీ ఆధ్వర్యంలో ఉన్న భూముల విషయం కేంద్రం షరిష్కారం చేసింది గుర్తులేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితి లేకనే.. కేంద్రం మీద నింద వేస్తున్నారని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేస్తుందని, కేంద్రం తెలంగాణకు ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.

కేంద్రంపై ప్రతిపక్షం, పాలక పక్షం కక్ష : ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షం, పాలక పక్షం కక్ష బయటపడిందని, ఈ బడ్జెట్ దేశానికి సంబంధించినదని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్ మూడు జిల్లాలకు పరిమితమైనదని కాదని, ఇది వికసిత భారత్ బడ్జెట్ అని చెప్పారు. గడిచిన పదేండ్లు సిద్దిపేట, గజ్వేల్.. ఇప్పుడు కొడంగల్, మధిరకు బడ్జెట్ కేటాయింపులు అని, అన్ని నియోజకవర్గాలకు నిధులు కేటాయించాలని అన్నారు. సమస్యలు పక్కదారి పట్టించేందుకే తీర్మానాలు చేస్తున్నారని విమర్శించారు.

అసమర్థత కప్పిపుచ్చుకోవడానికే : ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

కాంగ్రెస్ ప్రభుత్వ తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి అసెంబ్లీలో తీర్మానాలు చేస్తోందని, గతంలో కేంద్రం సహకారంతో ఒఆర్ఆర్ నిర్మించుకున్నామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆర్ఆర్ఆర్ కోసం రూ.30వేల కోట్లు ఇచ్చినా కేంద్రాన్ని తులనాడుతున్నారని అన్నారు. పదేండ్ల కిందట అదిలాబాద్ జిల్లాలో ఒక్క కేంద్రీయ విద్యాలయం ఉంటే.. తర్వాత నాలుగు మంజూరు చేశారన్నారు. కేంద్రం నుంచి నిధులు రాకపోతే ప్రభుత్వాన్ని నడిపే దమ్ము, ధైర్యం, సత్తా మీలో ఉందా అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు వస్తే వాటిని పక్కదారి పట్టిస్తున్నారన్నారు.

బిజెపి ఎదుగుదల తట్టుకోలేక నిందలు : ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

రాష్ట్రంలో బిజెపి ఎదుగుదల తట్టుకోలేక నిందలు వేస్తున్నారని, దేశంలో అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇస్తుందని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఒక రాష్ట్రానికి మాత్రమే కేంద్రం నిధులు ఇవ్వదన్నారు.

NOTICE

IN THE COURT OF THE PRL. DIST. JUDGE: GUNTUR

T.O.P.No: 1463 / 2022

Between:
Smt.Pachava Subba Rathnam and Others. ....Petitioners
And
M/s.Santhi Housing Plots Owners Welfare Association, Rep.by its Secretary Smt. R. Suhasini & Others. .... Respondent's

To,
R-54: Velicheti Mrudula Padma Saravana, W/o. Suribabu, R/o. Door No. 1-10-79, Ashok Nagar,Hyderabad, Rangareddy Dist.,Telangana State.

పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్‌కి నోటీసు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన ఉదహరించిన రెస్పాండెంట్ **ది.14-08-2024**న **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారిఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.

గాదంశెట్టి రామకృష్ణ
పిటీషనర్స్ తరపు న్యాయవాది, మంగళగిరి, గుంటూరు. సెల్: 9848504078

G. R. CABLES LIMITED
CIN: L31300TG1992PLC013772
Regd. Off.Add: #301, Madhava Apartments, Hill Colony, Khairatabad, Hyderabad – 500 004, Telangana State, India. email: grcablesltd@gmail.com

33వ వార్షిక సర్వసభ్య సమావేశం, పుస్తక ముగింపు మరియు ఇ-ఓటింగ్ సమాచారం ప్రకటన

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా సదరు వార్షిక సర్వసభ్య సమావేశపు నోటీసులో పేర్కొన్నట్లుగా వ్యాపార నిర్వహణకు నవోదయ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ కాలనీ, గుడిమల్కాపూర్, మెహిపట్నం, హైదరాబాద్-500028 వద్ద కంపెనీ యొక్క 33వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజిఎం) బుధవారం, 14 ఆగష్టు, 2024న ఉ.10.00గం.లకు ఐఎస్టీకి నిర్వహించబడును.
సర్క్యులర్లను అనుసరించి, వార్షిక రిపోర్టు 2023-24 యొక్క ఎలక్ట్రానిక్ కాపీని శుక్రవారం, 19 జూలై, 2024 నాటికి కంపెనీ/ డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇ-మెయిల్ ఐడిలు కలిగియున్న అట్టి సభ్యులందరికీ పంపబడినది. కంపెనీ యొక్క 33వ ఏజిఎం నోటీసుతో వార్షిక రిపోర్టు స్టాక్ ఎక్ఛేంజీ వెబ్‌సైట్: www.bseindia.com నందు అందుబాటులో ఉంది. ఇమెయిల్స్ ద్వారా ఏజిఎం నోటీసు డిస్పాచ్ 23 జూలై, 2024న పూర్తి అయింది. కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) అమెండ్‌మెంట్ రూల్స్, 2015 యొక్క రూల్ 20 మరియు సెబీ (ఎల్ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44తో చదవగల కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 నియమాలను అనుసరించి ఏజిఎం వద్ద రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ సిస్టం వసతిని కంపెనీ దీని సభ్యులకు కల్పిస్తున్నది. ఏజిఎం తేదిన రిమోట్ ఇ-ఓటింగ్ అదే విధంగా ఇ-ఓటింగ్ సిస్టం ఉపయోగిస్తూ ఓటును వినియోగించు వసతిని బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా కల్పించబడును.
కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) అమెండ్‌మెంట్ రూల్స్, 2015లోని రూల్ 20ను అనుసరించి, ఏజిఎం తేదిన రిమోట్ ఇ-ఓటింగ్ అదే విధంగా ఇ-ఓటింగ్ సిస్టం ఉపయోగిస్తూ ఎలక్ట్రానిక్ విధానంచే ఓటు అర్హతను నిర్ణాయించుటకు "కటాఫ్ తేది"గా 07 ఆగష్టు, 2024ను కంపెనీ నిర్ణయించింది. కటాఫ్ తేది అనగా 07 ఆగష్టు, 2024 నాటికి డిపాజిటరీల ద్వారా నిర్వహించబడుతున్న సభ్యుల రిజిస్టర్‌లో పేరు రికార్డు కాబడిన వ్యక్తి అర్హులు. మీటింగ్‌కు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్‌చే ఇది వరకు వారి ఓటును వినియోగించిన సభ్యులు కుడాను మీటింగ్‌కు హాజరు కావచ్చును కానీ ఏజిఎంలో మళ్లీ వారి ఓటును వినియోగించుటకు అనుమతి ఉండదు.
రిమోట్ ఇ-ఓటింగ్ వ్యవధి ఆదివారం, 11 ఆగష్టు, 2024న ఉ.9.00గం.లకు ప్రారంభమగును మరియు మంగళవారం, 13 ఆగష్టు, 2024న సా.5.00గం.లకు ముగియును. ఈ కాలవ్యవధి సమయంలో కంపెనీ యొక్క అర్హతగల వాటాదారులు భౌతిక రూపంలో లేదా డిమేటరియలైజ్డ్ రూపంలో వాటాలను కలిగియున్న వారు ఎలక్ట్రానికల్లీ వారి ఓటును వినియోగించవచ్చును. ఇ-ఓటింగ్ మోడ్యుల్ ఆ తరువాత ఓటింగ్ కొరకు బిగ్‌షేర్ చే డిసబుల్ చేయబడును.
కటాఫ్ తేది అనగా 07 ఆగష్టు, 2024 నాటికి కంపెనీ యొక్క వాటాలను కొనుగోలుచేసిన మరియు కంపెనీచే ఏజిఎం నోటీసు డిస్పాచ్ తరువాత కంపెనీ యొక్క సభ్యుడిగా మారినా మరియు సభ్యులు రిజిస్టర్‌లో సేర్లు కనిపిస్తున్న అట్టి వ్యక్తులు బిఎస్ఇ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో కంపెనీస్ వెబ్‌పేజీపై 33వ ఏజిఎం నోటీసును వీక్షించవచ్చును. సదరు సభ్యులు ఏజిఎం నోటీసులో పేర్కొన్న విధానం అనుసరించుట ద్వారా రిమోట్ ఇ-ఓటింగ్‌చే వారి ఓట హక్కులను వినియోగించుకోవచ్చును.
ఎలక్ట్రానిక్ విధానంచే ఓటింగ్‌కు సంబంధించినన ఏదేని ప్రశ్నలు/ సాధకబాధకల విషయంలో వాటాదారులు తరచుగా అడిగిన ప్రశ్నలు (ఎఫ్ఏక్యూస్) మరియు డౌన్‌లోడ్ సెక్షన్ క్రింద https://ivote.bigshareonline.com వద్ద లభించు ఇ-ఓటింగ్ మ్యానువల్‌ను రిఫర్ చేసుకోవచ్చును లేదా మాకు ivote@bigshareonline.com వద్ద ఇమెయిల్ లేదా కంపెనీ యొక్క ఇమెయిల్: grcablesltd@gmail.com కు మీరు ఇమెయిల్ చేయవచ్చును.
న్యాయమైన మరియు పారదర్శక విధానంలో ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించుటకు స్క్రూటినైజర్‌గా శ్రీమతి మంజుల ఆటేటి, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీ వారు నియమించబడ్డారు.
ఇందుమూలంగా ప్రకటన ఇవ్వమేమనగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 91 మరియు అందులోని వర్తించు రూల్స్ మరియు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 42& 47ను అనుసరించి, 33వ ఏజిఎం నిమిత్తం కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు వాటా బదిలీ పుస్తకాలు గురువారం, 08 ఆగష్టు, 2024 నుండి బుధవారం, 14 ఆగష్టు, 2024 (రెండు రోజులతోకలిపి) మూసియుండును.
సభ్యులు ఎవరైతే వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేయని వారు వారి సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో మరియు భౌతిక రూపంలో వాటాలను కలిగియున్న సభ్యులు grcablesltd@gmail.com కు ఇమెయిల్ పంపించుట ద్వారా అవసరమైన వివరాలు అనగా ఫోలియో నెంబరు, వాటాదారు పేరు అందించుట ద్వారా వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోవచ్చును.

By order of the Board
For G. R. Cables Limited
Sd/-
Nitin Kumar Mathur
Whole-time Director
DIN # 06451862

Place : Hyderabad
Date : 24-07-2024

బడ్జెట్‌లో పేదల సబ్సిడీలకు కోతలు

- పుట్టపాకలో అమరవీరుల వర్ధంతి సభలో వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
"బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పేదల సబ్సిడీలను తగ్గించింది.. అది పెట్టుబడిదారులకు మాత్రమే ఉపయోగపడే బడ్జెట్.. ఎరువులపై సబ్సిడీలకు కోత పెట్టారు. పేదలు, మధ్యతరగతి ప్రజల కోసం కేటాయింపుల్లేవు.. ఉద్యమాల ద్వారానే పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలం.. ఆ ఉద్యమాల ద్వారానే అమరుల ఆశయాలూ నెరవేరుతాయి.. పుట్టపాక కామ్రేడ్స్‌కు రెడ్ సెల్యూట్ చేస్తున్నాం.." అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో బుధవారం సిపిఎం నాయకులు మర్రి నర్సిరెడ్డి, సుక్క అబ్బయ్య, నడికుడి శంకరయ్య, నడికుడి బచ్చయ్య 25వ వర్ధంతి సభ నిర్వహించారు. అమరవీరుల స్మారక భవనంపై ఎర్రజెండా ఎగరవేశారు. చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. 'అమరుల స్మృతి గీతాలు' పాటల సీడీని విడుదల చేశారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ.. నాయకులు చనిపోయి 25 ఏండ్లవుతున్నా వారి ఆశయ సాధనలో మమేకమై పనిచేయడం అభినందనీయమని, పుట్టపాక కామ్రేడ్స్ ఎర్రజెండా ఔన్నత్యాన్ని పెంచే విధంగా పనిచేస్తున్నారని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం రూ.48 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ గతేడాదితో పోలిస్తే పెరిగినప్పటికీ పేదలకు ఉపయోగపడే విధంగా లేదన్నారు. అత్యధిక శాతంగా ఉన్న

కార్యక్రమంలో మాట్లాడుతున్న బి వెంకట్

పేద మధ్యతరగతి ప్రజల వల్ల కేంద్ర ప్రభుత్వానికి ఏటా రూ.26 లక్షల కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ.. ఆ వర్గ ప్రజలకు ఉపయోగపడే విధంగా బడ్జెట్ కేటాయింపులు లేవని అన్నారు. అతి తక్కువ శాతంగా ఉన్న పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. రైతులకు ఇచ్చే ఎరువులపై ఈ రెండేళ్ల కాలంలో రూ.లక్ష కోట్ల సబ్సిడీలు తగ్గించిందన్నారు. ఆహార సబ్సిడీలను రూ.70 వేల కోట్లు తగ్గించిందన్నారు. రాబోయే కాలంలో రేషన్ షాపుల ద్వారా బియ్యం కూడా పంపిణీ చేయకుండా నగదు బదిలీ చేస్తామనడం సరికాదన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కంపెనీ వ్యవసాయాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు.

నరేంద్ర మోడీ ప్రజావ్యతిరేక పాలనకు ఉద్యమాల ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఎర్రజెండా పోరాటాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ పథకాలన్నీ కమ్యూనిస్టు ఉద్యమాల ఫలితంగా వచ్చినవే అని చెప్పారు.

ప్రజా పోరాటాలే కమ్యూనిస్టుల ఆయుధం : జూలకంటి

ప్రజా పోరాటాలే కమ్యూనిస్టుల ఆయుధమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. అమరుల జ్ఞాపకార్థం ఎంఎన్ఆర్ ట్రస్ట్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. అరాచకాలకు పాల్పడిన హంతకులే నేడు ఉనికి లేకుండా పోయారే తప్ప అమరుల ఆశయాలు ఆగిపోలేదన్నారు. స్థానిక సిపిఎం నాయకులు అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నందుకు అభినందనలు తెలిపారు. కమ్యూనిస్టులకు ఓట్లు రాకున్నా, సీట్లు లేకుండా నిజాయితీగా నికరంగా ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రజల్లో కమ్యూనిస్టులకు ఉన్న విలువ డబ్బులతో పదవులు కొనుక్కున్న నాయకులకు ఉందా అని ప్రశ్నించారు.

సీనియర్ నాయకులు దొంతగాని పెద్దులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, మండల కార్యదర్శి దొడ యాదిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసచారి, స్థానిక మాజీ ఎంపిటిసి మర్రి వసంత, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ముత్యాలు, జర్నలిస్ట్ మర్రి మహేందర్, నాయకులు పిట్ట రాములు, నాంపల్లి చంద్రమౌళి, ఐతరాజు గాలయ్య, పుట్టపాక ఉపసర్పంచ్ చంద్రశేఖర్, అమరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని మమతకు ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న కెటిఆర్

'గిఫ్ట్ ఎ స్మైల్'లో భాగంగా..
విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందించిన కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పుట్టినరోజు సందర్భంగా 'గిఫ్ట్ ఎ స్మైల్' కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందించారు. బుధవారం కెటిఆర్ జన్మదినం సందర్భంగా ఆయన స్వగృహంలో రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ పాటిమీది జగన్మోహన్ రావు, నాని వెంకట్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే నాని వెంకట్ సోదరి మమతకు ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్‌ను కెటిఆర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మమతను కెటిఆర్ ఆశీర్వదించి.. ఉన్నత చదువులు చదువుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

317 జిఒ బాధితులకు వెరిఫికేషన్

- డిహెచ్ రవీందర్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
అప్పీల్ చేసుకున్న 317 జిఒ బాధితులు వెరిఫికేషన్‌కు రావాలని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాధితులు గురువారం ఉదయం పది గంటలకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి రావాలని కోరారు.

సభలో నవ్వులు పూయించిన భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో
శాసనసభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నవ్వులు పూయించారు. సమావేశాల రెండోరోజైన బుధవారం ప్రశ్నోత్తరాలు, ఆ తర్వాత కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని ముక్తకంఠంతో ఖండిస్తూ అధికార పార్టీ ప్రవేశ పెట్టిన తీర్మాణంపై వాడి వేడి చర్చ జరిగింది. సిఎం, మంత్రులు, కెటిఆర్, హరీష్‌రావుల మధ్య తీవ్ర వాదోపవాదాలు, వ్యక్తిగత విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో వాతావరణాన్ని చల్లబర్చేందుకు హరీష్‌రావుపై సభలో డీప్యూటీ సిఎం భట్టి సెటైర్లు వేశారు. "ఇది మాట్లాడు..అది మాట్లాడు అంటూ హరీష్‌రావు చిట్టీలు అందిస్తున్నారు. అధ్యక్షా.. ఇదెక్కడి న్యాయం. నేను డిప్యూటీ సిఎం కాబట్టి, నాకు చిట్టీలు అందిస్తున్నారు అంటే ఒక అర్థముంది. బిఆర్ఎస్ సభ్యులతో పాటు బిజెపికి సభ్యులకు చిట్టీలు అందిస్తున్నారు" అని అనడంతో సభలో పెద్ద ఎత్తున నవ్వులు విరిశాయి. రైతులకు రుణమాఫీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శాసనసభ ఆవరణలో యాదగిరి గుట్ట లడ్డూలను అందించారు.

నేడు కాళేశ్వరానికి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం గురువారం సాయంత్రం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. శాసనసభ, శాసనమండలిలో బడ్జెట్ ప్రసంగాలు ముగిసిన వెంటనే బయలుదేరనున్నారు. మొదట కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్ (ఎల్ఎండి)ను పరిశీలిస్తారు. రామగుండంలో రాత్రికి బస చేయనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కన్నెపల్లి పంపు హౌజ్, ఆ తర్వాత 11 గంటలకు మేడిగడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించనున్నారు. రాత్రి 7.24 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

గ్రూప్ 2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలి : హరీశ్‌రావు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో
గ్రూప్ 2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చాంబర్‌కు వచ్చిన ఆయన...విక్రమార్క అందుబాటులో లేకపోవడంతో తనను కలిసి విలేకర్లతో మాట్లాడారు. గ్రూప్1 విషయంలో జీవో 55 తీసేసి, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా జీవో నెంబర్ 29 తెచ్చిందన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు 1:50 పద్ధతిలో నియామకం చేపట్టారని తెలిపారు. ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ ప్రభుత్వం, ఏపీలో వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 1:100 పద్ధతిలో నియామకాలు చేపట్టిందని గుర్తు చేశారు. 2015లో తాము, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్లకు, సప్లిమెంటరీ నోటిఫికేషన్లు ఇచ్చి అదనపు ఉద్యోగాలిచ్చామని తెలిపారు. అప్పుడు తలెత్తని సమస్యలు ఇప్పుడెందుకు వస్తున్నాయని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

- మండలిలో నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డిఎ)లను విడుదల చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలి సమావేశంలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు వస్తాయా? రావా? అన్న ఆందోళన ఉండేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 15వ తేదీ వరకు జీతాలొచ్చే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. మార్చి నుంచి ఒకటో తేదీన జీతాలివ్వడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పారు.

ఈ-కుబేర్‌లో ఉద్యోగులకు సంబంధించిన వివిధ రకాల బిల్లులకు సంబంధించి రూ. 40 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులకు జనవరి, డిసెంబర్‌లో ఏటా రెండు సార్లు డిఎలు రావాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డిఎలు వచ్చాయని, ఒక డిఎ పెండింగ్‌లో ఉందని అన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులకు నాలుగు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించాలని కోరారు. డిఎలను ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పాలని బిఆర్ఎస్ సభ్యులు వాణీదేవి ప్రశ్నించారు. పెన్షనర్లకు డిఆర్‌ను ఇవ్వాలని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు అడిగారు. వారికి నగదు రహిత వైద్యం అందించాలని సూచించారు.

త్వరలోనే డిఎలు చెల్లిస్తాం : భట్టి

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో త్వరలోనే ఉద్యోగులకు డిఎలను చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ధనిక రాష్ట్రం ఉన్నప్పుడే ఏడు నెలల నుంచి రెండేళ్ల వరకు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. తాము అంత సమయం తీసుకోబోమని, త్వరలోనే డీఏలను చెల్లిస్తామని అన్నారు.

ప్రొఫెసర్ల వయోపరిమితిని 63 ఏళ్లకు పెంచాలి

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల వయోపరిమితిని 63 ఏళ్లకు పెంచాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలి సమావేశంలో బుధవారం ఈ అంశంపై ఆయన పిటిషన్ సమర్పించారు. విశ్వవిద్యాలయాల్లో దశాబ్ద కాలం నుంచి ప్రొఫెసర్ల నియామకాల ప్రక్రియ ఆగిపోయిందని చెప్పారు. ప్రస్తుతం వర్సిటీల్లో 60 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. నియామకాలను చేపట్టకుంటే రాబోయే రెండేళ్లలో ఎక్కువ మంది ఉద్యోగ విరమణ పొందే అవకాశముందన్నారు. ప్రొఫెసర్ల వయోపరిమితి ప్రస్తుతం 60 ఏళ్లు ఉందని, దాన్ని 63 ఏళ్లకు పెంచాలని కోరారు.

కెజిబివి ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇవ్వాలి

రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కెజిబివి)ల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైం స్కేల్‌ను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలి సమావేశంలో బుధవారం ప్రత్యేక ప్రస్తావన కింద ఈ అంశం గురించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతోపాటు ఐదు రకాల గురుకులాలున్నాయని చెప్పారు. కెజిబివిల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సరైన వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. వారికి మినిమం టైంస్కేల్‌ను వర్తింపచేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులను కూడా క్రమబద్ధీకరించాలని చెప్పారు.

వీధి కుక్కల స్వైర విహారం

- ఇద్దరు చిన్నారులతో సహా మరో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
వరంగల్ జిల్లాలో వీధికుక్కలు స్వైర విహారం చేశాయి. పర్వతగిరి, వాజేడు మండలాల్లో ఇద్దరు చిన్నారులు, మరో వ్యక్తిపై దాడి చేయగా, వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన బాసాని మనోజ్ మూడేళ్ల కుమారుడు విహాన్.. ఉదయాన్నే ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో బాలునిపై వీధి కుక్కలు విచక్షణారహితంగా దాడిచేశాయి. ఈ దాడిలో విహాన్ ముక్కు, కనురెప్ప, తలపై గాయాలై తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే అప్రమత్తమైన బాబు తల్లిదండ్రులు కుక్కలను చెదరగొట్టి బాలుడ్ని వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వాజేడు మండలం అయ్యవారిపేట గ్రామంలోని పాఠశాల వద్ద బాలుడిని కరిసి 24 గంటలు గడవక ముందే మరో వ్యక్తిపై దాడి చేశాయి. దాంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను నియంత్రించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తమ సమస్యను పరిష్కరించడం లేదని పర్వతగిరి, వాజేడు మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో అడుగు బయట పెట్టాలంటేనే జనం జంకుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడుతున్నామని, కుక్కల దాడి నుంచి చిన్నారులను రక్షించాలని బాధిత తల్లిదండ్రులతో పాటు మండల ప్రజలు కోరుతున్నారు.

బదిలీలతో సరోజినీ ఆస్పత్రి పరేషాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బదిలీలు ప్రభుత్వాస్పత్రుల సేవలపై ప్రభావం చూపిస్తున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో బదిలీ అయినవారు వెళ్లిపోగా అక్కడ చేరాల్సిన వారు రాకపోవడంతో రోగులకు అందే సేవలకు విఘాతం కలుగుతున్నాయని తెలుస్తున్నది. హైదరాబాద్‌లోని సరోజినీదేవి కంటి ఆస్పత్రి ప్రభుత్వాధ్వర్యంలో నడిచే ఏకైక పెద్ద ఆస్పత్రి. బదిలీల్లో భాగంగా ఈ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.రాజలింగంతో సహా ఐదుగురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్స్ ప్రొఫెసర్లు, 11 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫార్మసిస్ట్, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, సిస్టర్స్, హెల్త్ ఇన్స్పెక్టర్, గ్లకోమా అండ్ కార్నియాకు సంబంధించిన సిబ్బంది బదిలీపై వెళ్లిపోయారు. అయితే సరోజినీ ఆస్పత్రికి బదిలీపై రావాల్సిన వారంతా వచ్చి చేరకపోవడంతో బుధవారం ఆస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ ఆస్పత్రికి రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా రోగులు పెద్ద ఎత్తున వస్తుంటారు. బదిలీల ప్రక్రియలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రోగులు ఇక్కట్ల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి, వికలాంగులకు సందానకర్తగా 'వికలాంగుల వాయిస్'

- పదో వార్షికోత్సవ పోస్టర్‌ను అవిష్కరించిన ముత్తినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ప్రభుత్వానికి, వికలాంగులకు మధ్య సందాన కర్తగా 'వికలాంగుల వాయిస్' పత్రిక పనిచేస్తుందని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో వికలాంగుల వాయిస్ మాస పత్రిక దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆయన అవిష్కరించారు. వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. వారి హక్కుల పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్పొరేషన్ ద్వారా వారికి అవసరమయిన పరికరాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. వారి కోసం ప్రత్యేకంగా మాస పత్రిక తీయడం తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారన్నారు. ఆ పత్రిక పదో వార్షికోత్సవ ఉత్సవాలు జయప్రదం చేయటానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని చెప్పారు. పత్రిక గౌరవ సలహాదారులు పి ఉమ్మర్ ఖాన్ మాట్లాడుతూ వికలాంగులను చైతన్యం చేసేందుకు 2014 నుంచి వికలాంగుల వాయిస్ మాస పత్రిక నడుపుతున్నామని తెలిపారు. చట్టాలు, జిఒలు పత్రిక ద్వారా వికలాంగులకు చేరవేస్తున్నామని చెప్పారు. పత్రిక ప్రారంభించి పదేళ్లు అవుతున్న సందర్భంగా ఆగష్టు 12న దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వికలాంగుల కళాకారులతో సంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికల, జె మల్లేష్, హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి పి నాగమణి, నాయకులు అదర్శ్, స్వరూప పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత జాషువా : కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సామాజిక సమానత్వం కోసం కలం యుద్ధం చేసిన విప్లవ కవి గుర్రం జాషువా నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గబ్బిలం, తిరదౌసి వంటి కావ్యాలు రాసి సమాజంలో వేల సంవత్సరాలుగా ఉన్న కుల అసమానతలపై యుద్ధం చేశారని కొనియాడారు. మూఢవిశ్వాసాలు, అసమానతలు సమాజంలో తరతరాలుగా కొనసాగడం వల్లే దేశంలో పేదరికం పెరిగిందని జాషువా పద్యాల్లో కనిపిస్తాయన్నారు. నేటికీ కొనసాగుతున్న కుల వివక్ష, అంటరానితనాన్ని రూపుమాపడానికి యువతరం ఒక సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ రజనీకాంత్ రాష్ట్ర కమిటీ సభ్యులు జె రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు

అసమానతలపై గళమెత్తిన జాషువ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై గళమెత్తిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ సాహితి - టిపిఎస్‌కె ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాకవి గుర్రం జాషువ 53వ వర్ధంతి సభ తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ప్రముఖ కవి మాస్టర్‌జీ మాట్లాడుతూ తక్కువ కులంగా భావించబడ్డ కులంలో జన్మించినందున అనేక అవమానాలు ఎదుర్కొన్నారని వాఖ్యానించారు. ఛీత్కారాలు ఎదురైన చోటే తన కవిత్వం ద్వారా జాషువా సత్కారాలు పొందారని అన్నారు. తెలంగాణ ప్రాచ్య కళాశాల పూర్వ ప్రధానాచార్యులు మోతుకూరు నరహరి మాట్లాడుతూ తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి జాషువాకు గండపెండేరం తొడిగారని గుర్తు చేశారు. సామాజిక అసమానతలను, సాంఘిక దురాచాలను తన రచనల ద్వారా చీల్చి చెండాడారని అన్నారు. ఈ సభలో టిపిఎస్‌కె రాష్ట్ర నాయకులు జి రాములు, భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు అనంతోజు మోహన్ కృష్ణ, సలీమ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేకంగా మందుల తయారీ

- రూ.96 లక్షల సామగ్రి సీజ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
చట్టవ్యతిరేకంగా తయారీ చేసి, నిల్వ చేసిన రూ.96 లక్షల విలువైన ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరక్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ముదుచింతలపల్లి గ్రామంలో అస్పెన్ బయోఫార్మాకు చెందిన గోదాములో వీటిని నిల్వ ఉంచారు. అస్పెన్ బయోఫార్మా కు చెందిన కడారీ సతీష్ రెడ్డిపై గతంలోనూ డిసిఎ కేసులు నమోదు చేసింది. సీజ్ చేసిన మందుల్లో యాంటీ క్యాన్సర్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ కోగలెంట్స్, యాంటీ డిప్రెసెంట్స్ తదితర రకాల ఔషధాలున్నాయి. గతేడాది డిసెంబర్ లో మచ్చబొల్లారంలో పట్టుబడిన యాంటీ క్యాన్సర్ మందుల కేసులోనూ కడారి ముద్దాయి. అదే నెలలో ఖమ్మం జిల్లా, తల్లాడ మండలం, అన్నారుగూడెం గ్రామంలో నమోదు చేసిన అక్రమ తయారీ కేసులోనూ ఆయన అనుమానితునిగా ఉన్నారు.

మెడికల్ షాపు లైసెన్స్ రద్దు

చట్టవిరుద్ధంగా మందులను అమ్ముతున్న ఒక మెడికల్ షాపు లైసెన్స్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు రద్దు చేశారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ కమిషనర్ ఇచ్చిన సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యసనపరులకు షెడ్యూల్ హెచ్ 1, షెడ్యూల్ ఎక్స్ పరిధిలోకి వచ్చే మందులను పలు మెడికల్ షాపులు అమ్ముతున్నట్టు గుర్తించారు. డాక్టర్లు ఇచ్చే ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా తీసుకుని మాత్రమే వీటిని రోగులకు విక్రయించాలనే నిబంధనలను ఈ మెడికల్ షాపులు ఉల్లంఘించాయి. హైదరాబాద్ వాయుపురి కాలనీలోని లక్ష్మి నర్సింహ మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌ను రద్దు చేయగా, మరో 20 మెడికల్ షాపుల్లో అమ్మకాలపై రెండు రోజుల నుంచి 60 రోజులకు వరకు నిషేధం విధించారు.

'లక్ష'లాదిమంది రైతుల గగ్గోలు

- ఖమ్మం జిల్లాలోనే అత్యధిక మందికి మాఫీ కాని రుణాలు
- కారణాలు తెలియక ఆందోళనలో రాష్ట్ర రైతాంగం
- బ్యాంకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- రేషన్‌కార్డు ప్రామాణికమే కారణమని భావిస్తున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రేషన్‌కార్డు లేదనా? పిఎం కిసాన్ నిబంధనలా? లేక రెన్యూవల్ చేయలేదనా? చేశారనా? రీషెడ్యూలనా? నిర్దేశిత గడువుకు ముందు తీసుకున్నారనా? లేక గోల్డ్‌లోన్ రుణాలనా? కుటుంబంలో ఇద్దరు, ముగ్గురి పేర్లతో రుణాలున్నాయనా? ఒక్కరికే రెండు, మూడు బ్యాంకుల్లో లోన్లు ఉన్నాయనా? పట్టేదారు పాస్‌పుస్తకాలు లేవనా? కారణాలేవైనా అర్హతున్న లక్షలాది మంది రైతుల పేర్లు రూ.లక్షలోపు మాఫీ జాబితాలో లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ మూడురోజులుగా తిరుగుతున్నా ఎవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఫేక్ జాబితాలు సైతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వాటిలో పేర్లు కనిపించకపోవడంతో మాఫీ అయ్యి మెసేజ్ రాని వారు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

లక్ష జాబితాలో డొల్లతనం..

రూ.లక్షలోపు రుణమాఫీ జాబితాల్లో ప్రభుత్వ డొల్లతనం వెలుగుచూసింది. మెజార్టీ అర్హులకు మాఫీ కాలేదు. ఒక్క ఖమ్మం డిసిసిబి పరిధిలోనే రూ.లక్షలోపు రుణం ఉన్నవారు 1,43,327 మంది ఉన్నారు. వీరికి రూ.526 కోట్లు మాఫీ కావాలి. కానీ 37,625 మందికి రూ.121 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగిలిన 1.05 లక్షల మందికి మాఫీ ఎందుకు కాలేదనే ప్రశ్నకు సమాధానాలు లేవు. జిల్లాలోని కారేపల్లి సొసైటీలో 3,790 మంది రైతులు రుణమాఫీకి అర్హులు. వీరికి రూ.19.27 కోట్లు మాఫీ కావాలి. వీరిలో రూ.లక్షలోపు రుణాలు మాఫీ కావాల్సిన వారు 3,153 మంది. వీరికి మాఫీ కావాల్సిన సొమ్ము రూ.10.30 కోట్లు.. కానీ కేవలం 668 మందికి రూ.2.06 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి.

'లక్ష' సందేహాలు.. ఒకటి, రెండే సమాధానాలు..

రూ.లక్షలోపు రుణమాఫీ అధికశాతం అర్హులకు వర్తించకపోవడంపై లక్ష సందేహాలున్నా ఒకటి, రెండు సమాధానాలు మాత్రమే వినిపిస్తున్నాయి. జాబితా వెలువరించాక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు బాధితులు భారీగా వస్తున్నారు. రైతులడిగే ప్రశ్నలకు ఒక్కటే సమాధానం ప్రధానంగా వినిపిస్తోంది. రేషన్‌కార్డు లేకపోవడంతో ఫ్యామిలీని గుర్తించడంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయని అంటున్నారు. గత ప్రభుత్వం రేషన్‌కార్డు లేనిపక్షంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిగణనలోకి తీసుకుంది. అయినా అప్పట్లో లోపాలు భారీగానే తలెత్తాయి. ఇప్పుడు పదేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదు. అలాంటప్పుడు రేషన్‌కార్డును ఎలా ప్రామాణికంగా తీసుకుంటారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకరికి రెండు బ్యాంకుల్లో ఖాతాలు ఉండీ.. రెండు కలిపి కూడా రూ.లక్షలోపే ఉన్నా ఒకదాంట్లో మాత్రమే మాఫీ అయ్యి.. మరో దాన్ని వదిలివేశారు. పాస్‌బుక్‌లు లేనివారి రుణాలు కూడా మాఫీ కాలేదు. ఖమ్మం జిల్లాలో పాస్‌బుక్‌లు లేకుండా రుణాలు తీసుకున్న రైతులు వేలాదిగా ఉన్నారు. కొత్త పాస్‌బుక్‌లు రాకముందు పహానీల ఆధారంగా పంటరుణాలిచ్చారు. అనేక మంది పాస్‌బుక్‌లు లేకుండా లోన్లు తీసుకున్నారు. అటువంటి వారు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక పాత రుణాలను రెన్యూవల్ చేయడం లేదు. కాబట్టి ఇలాంటి రైతులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు. ఒక్క ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోనే 3,790 మంది రైతులకు గాను 921 మందికి పాస్‌పుస్తకాలు లేవు. ఇక ప్రభుత్వం విధించిన ప్రారంభ గడువు తేదీ కూడా అనేక మంది రైతులకు ప్రతికూలంగా మారింది.

రూ.68వేలే ఉన్నా మాఫీ కాలేదు - మాదూరు రమణారెడ్డి, రెడ్డిగూడెం, కొణిజర్ల

నాకు స్థానిక బ్యాంకులో రూ.68వేల రుణం మాత్రమే ఉంది. రేషన్‌కార్డుతో పాటు పాస్‌బుక్ కూడా ఉన్నా మాఫీ జాబితాలో నా పేరు లేదు. దాంతో వ్యవసాయ, బ్యాంక్ అధికారులను కలిశా.. సోమవారం ఉదయం 11 గంటలకల్లా కలెక్టరేట్‌కు రావాలని చెప్పారు. ఇలా అనేక గ్రామాల్లో రూ.30 వేల లోపున్న రైతులకూ మాఫీ వర్తించకపోవడం గమనార్హం.

జాబితా ప్రదర్శించాలి.. తిరస్కరణకు కారణాలు చూపాలి..
- బొంతు రాంబాబు, రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

ప్రతి గ్రామంలో రూ.లక్షలోపు క్రాప్‌లోన్ ఉన్న 30శాతం మంది రైతుల పేర్లు మొన్నటి జాబితాలో లేవు. కారణాలు ఏంటనేది కూడా కచ్చితంగా తెలియట్లేదు. కాబట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలలోపు రుణమాఫీ జాబితాలను ప్రదర్శించాలి. స్థానిక పంచాయతీ కార్యాలయంతో పాటు రైతువేదికల వద్ద వీటిని ఏర్పాటు చేయాలి. ఆలోపు పంట రుణమున్నా రిజెక్ట్ చేస్తే అందుకు గల కారణాలను సైతం ఆ జాబితాలో పొందుపరచాలి. ఆతర్వాత కూడా సరైన ఆధారాలను చూపిస్తే అర్హులుగా గుర్తించాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి సరైన సమాధానాలు రావట్లేదు. అధికారులు ఎవరూ సరైన సమాధానం ఇవ్వట్లేదు.